సాక్షి
విజయనగరం
సోమవారం । 24 । జూలై । 2023



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టు

రాష్ట్రస్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది.

- 8లో



శరవేగంగా..సర్వే

గ్రామాల్లో పంట పొలాల కొలతలు నిర్ధారించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టింది.

- 8లో

పలువురు డీఎస్పీలకు బదిలీలు

విజయనగరం క్రైమ్: పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కెవి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్.శ్రీనివాసరావును దిశా డీఎస్పీగా బదిలీ చేశారు. ఎస్సీ ఎస్టీ సెల్‌లో డీఎస్పీగా పని చేస్తున్న ఎం.వీరకుమార్ పీటీసీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీ సెల్‌కు డీఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

న్యూస్‌రీల్

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: భారత ప్రభుత్వం ప్రతి ఏడాది గణతంత్ర దినోత్సవం రోజున ప్రకటించే పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ ఆదివారం తెలిపారు. అవార్డులకు కళలు, సాహిత్యం – విద్యా రంగం, క్రీడలు, వైద్యం, సమాజ సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, పౌర సేవలు, వ్యాపారం – పరిశ్రమలు తదితర రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన యువత/వ్యక్తుల మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. పద్మ అవార్డులకు ఎంపిక నిమిత్తం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి సిఫార్సుతో యువజన సర్వీసుల శాఖ భారత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించటం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు వచ్చే నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో తమ దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9849913080 నంబరును కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

అసెంబ్లీ ఎమినిటీస్ కమిటీ సభ్యుడిగా పెనుమత్స



డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఏపీ అసెంబ్లీ ఎమినిటీస్ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. 12 మందితో ఉన్న ఈ కమిటీకు చైర్మన్‌గా స్పీకర్ తమ్మినేని సీతారాం వ్యవహరించగా శాసనసభ నుంచి 8 మందిని, శాసన మండలి నుంచి ముగ్గురిని సభ్యులుగా నియమించారని ఎమ్మెల్సీ సురేష్‌బాబు తెలిపారు. రెండు సభల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మెరుగైన సౌకర్యాలు అందేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

శ్రీరాముడి పాదుకలకు ప్రత్యేక పూజలు



స్వామివారి వెండి పాదుకలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో అయోధ్యలో ప్రతిష్ఠించనున్న శ్రీరామ పాదుకలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరంలో శ్రీరాముడి పాదుకలను ప్రతిష్ఠించాలనే ప్రధాన సంకల్పంతో అయోధ్యకు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి అనే రామ భక్తుడు సుమారు 10 కిలోల వెండితో స్వామి వారికి పాదుకలను తయారు చేయించారు. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాల్లో స్వామి పాదుకలకు ప్రత్యేక అర్చనలు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రామతీర్థం చేరుకున్న పాదుకలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోడికొండపై ఉన్న కోదండ రామాలయంతో పాటు కొత్తపేట సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి పాదుకలకు అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాదుకలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో రామ భక్తులు విజయ్‌కుమార్, సురేష్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వంగరలో గజరాజుల హల్‌చల్



ఏనుగుల గుంపు

వంగర: మండలంలోకి గజరాజులు శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రవేశించాయి. ఎనిమిది గజరాజుల గుంపు మండల పరిధి కింజంగి, శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీ, శ్రీహరిపురం మీదుగా బాగెంపేట వద్దకు చేరుకొని ఎస్సీ కాలనీ సమీపంలో తిష్ట వేశాయి. ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేశాయి. బాగెంపేటలో రైతు జొన్నాడ చంటికి చెందిన ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. నిరుపేద రైతును ఆదుకోవాలని బాగెంపేట సర్పంచ్ రెడ్డి సత్యవతి అధికారులకు కోరారు. గజరాజుల ప్రవేశంతో అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఆరోగ్యానికి భరోసా

ప్రజారోగ్యమే పరమావధిగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. పల్లె రోగుల చెంతకే వైద్య సేవలు అందేలా పక్కా ప్రణాళికతో ముందడుగు వేసింది. ఫలితంగా ఈ రోజు రోగి ఇంటికే వైద్యుడు నేరుగా వెళ్లి సేవలు అందిస్తున్న ఘనతను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సొంతం చేసుకుంది.



నా పేరు కోలా అప్పలనరసమ్మ. రాజాం మండలం మారేడుబాక గ్రామం మాది. గతంలో ఏ ఆరోగ్య తనిఖీ చేయించుకోవాలన్నా రాజాం వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. జ్వరం వచ్చినా భయపడేవాళ్లం. ఒక్కోసారి ప్రాణాల మీదకు వచ్చేది. గ్రామాల్లో డాక్టర్లు అందుబాటులో ఉండే వారు కాదు. ఇప్పుడు వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు వచ్చిన తరువాత ఆ భయం తగ్గింది. గ్రామంలో హెల్త్ క్లినిక్ వద్దకు వైద్యులు, సిబ్బంది వస్తున్నారు. ఆ సమయంలో వెళ్తే 14 రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. దీంతో హాయిగా జీవించగలుగుతున్నాం.



తెర్లాం మండలం నెమలాంలో వైద్య సేవలు అందిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

- వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌తో రోగుల చెంతకే వైద్యం
- జిల్లాలో 482 క్లినిక్‌లు
- 2020 నుంచి ఇప్పటి వరకు 68,01,138 మందికి సేవలు
- 12 రకాల వైద్య సేవలు
- 16 రకాల వైద్య పరీక్షలు
- రోగులకు 105 రకాల మందుల అందజేత
- టెలీ మెడిసిన్ ద్వారా ఇప్పటి వరకు 2,74,783 మందికి సేవలు



విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృతమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. వీటితో రోగులకు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి తప్పింది. అన్ని రకాల సేవలు గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. మాత, శిశువులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇక్కడ సేవలు అందిస్తున్నారు. నాలుగు వేల నుంచి ఐదు వేల జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి క్లినిక్‌లో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)గా ప్రభుత్వం నియమించింది. వీరు క్లినిక్‌లలో రోగులకు బీపీ, షుగర్‌తో పాటు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి సేవలు అందిస్తున్నారు. జిల్లాలో 482 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. 2020లో వీటిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 68,01,138 మందికి వైద్య సేవలు అందించారు. వీటితో పాటు ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం క్రింద నెలలో రెండుసార్లు వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. అదే విధంగా విలేజ్ క్లినిక్‌కు వచ్చే రోగులకు స్పెషాలిటీ సేవల కోసం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టెలీ మెడిసిన్ హబ్‌కు వీడియోకాల్ ద్వారా రోగి పరిస్థితిని వివరించి అక్కడ వైద్యుల సూచనల మేరకు రోగులకు సేవలు అందిస్తున్నారు.

12 రకాల సేవలు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 12 రకాల వైద్యసేవలు అందిస్తున్నారు. గర్భిణులకు, పిల్లలకు అవసరమైన తనిఖీలు, చికిత్స అందిస్తారు. నవజాత శిశువులకు, కిషోర బాలికలకు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు మహిళలను ప్రోత్సహించడం, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సీజన్ వ్యాధుల వ్యాప్తికి చర్యలు, ఓపీ సేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్‌తో పాటు, వాటి నివారణకు చర్యలు, ఈఎన్‌టీ, కంటి సమస్యలు ఉన్న వారికి సేవలు, నోటి సంరక్షణ, మానసిక సమస్యలు ఉన్న వారికి స్క్రీనింగ్, అగ్ని ప్రమాదంలో గాయపడ్డ వారికి, రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారికి సేవలు అందించడం, తదితర వైద్య సేవలు అందిస్తారు.

14 రకాల వైద్య పరీక్షలు



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు వచ్చే వారికి హెచ్‌బీ (హిమోగ్లోబిన్), హెచ్‌సీజీ (యూరిన్ టెస్టు), యూరిన్ టెస్ట్ ఫర్ పీహెచ్, బ్లడ్ షుగర్, మలేరియా పరీక్ష, హెచ్ఐవీ, డెంగీ, ఎసిటిక్ యాసిడ్, టెస్ట్ ఫర్ ఐయోడిన్ ఇన్ సాల్ట్, వాటర్ టెస్టింగ్, హెచ్‌బీఎస్ఏజీ, సిఫిలిస్, ఏఎఫ్‌బీ, విజన్ టెస్టు చేస్తారు.

105 రకాల మందుల అందజేత



వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌కు వచ్చే రోగులకు 105 రకాల మందులు అందిస్తారు. అల్ప్రాజోలమ్, ఎమాక్సిన్, అమ్లాపిడన్, ఎటిన్‌లాల్, బీ కాంప్లెక్స్, కాల్షియం, సిప్రాఫ్లాక్సిన్, క్లోమోట్రోజోల్, డైజోపామ్, డైక్లోఫిన క్, డైసైకోమిన్, డొమిరిడోన్, ఫ్లూకొనజోల్, గ్లమిపిరి డ్, మెట్‌ఫార్మిన్, మెగ్నిషియం సల్ఫేట్, ఐరన్ ఫ్లోరిక్ యాసిడ్ తదితర మందులు అందజేస్తారు.



డెంకాడ మండలం పెదతాడివాడలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్

ఇంటి వద్దే వైద్య పరీక్షలు



గతంలో అనారోగ్యానికి గురైతే ఎన్నో వ్యయప్రయాసలు పడి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేవాళ్లం. డబ్బులు ఖర్చుతో పాటు సరైన వైద్య పరీక్షలు జరగక ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ సమస్య లేదు. గ్రామాల్లోనే వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు వైద్యులు ఇంటి వద్దకే వస్తున్నారు. పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తున్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఇల్లు కదలకుండా వైద్య సేవలు పొందుతున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– చల్లా మంగమ్మ, వండానపేట, రేగిడి మండలం


టెలి మెడిసిన్ హబ్ ద్వారా 2,74,783 మందికి సేవలు



టెలి మెడిసిన్ హబ్ జిల్లాలో 2021లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఈ ఏడాది జూన్ నెలాఖరు నాటికి 2,74,783 మందికి సేవలు అందించారు. 2021లో 1,40,208 మందికి, 2022లో 1,11,887 మందికి సేవలు అందించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి జూన్ నెలాఖరు నాటికి 22,680 మందికి సేవలు అందించారు.

ఫ్యామిలీ డాక్టర్ ద్వారా 3,28,087 మందికి సేవలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జిల్లాలో 2022 అక్టోబర్ నెలలో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 3,28,097 మందికి వైద్య సేవలు అందించారు.



ఇందులో జనరల్ ఓపీ 2,12,368, గర్భిణులు 16, 647 మందికి, బాలింతలు 9087 మందికి సేవలు అందించారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు 21,210 మందికి, బీపీ రోగులు 39,947 మందికి, బీపీ, షుగర్ రెండు వ్యాధులు ఉన్న 24,449 మందికి సేవలు అందించారు.

మందుల ఖర్చు తగ్గింది



నేను మూడేళ్ల కిందట విలేజ్ క్లినిక్‌కు వెళ్లాను. అక్కడ నాకు బీపీ ఉందని చెప్పారు. అప్పటి నుంచి అక్కడ ఇస్తున్న మందులు వాడుతున్నాను. ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పింది. మందుల ఖర్చు తగ్గింది. అన్నీ ఉచితంగానే అందుతున్నాయి. – గొల్ల దేముడు, లక్కిడాం, గంట్యాడ మండలం

ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పింది



నాకు మూడేళ్ల కిందట షుగర్ ఉందని తేలింది. అప్పటి నుంచి విలేజ్ క్లినిక్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేసుకుని అక్కడ ఇచ్చిన మందులు వాడుతున్నాను. అంతకు ముందు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేవాడిని. ఇప్పుడు డబ్బుల ఖర్చుతో పాటు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే బాధ తప్పింది.

– దుక్క రమణ, చందులూరు, ఎల్.కోట మండలం

ఇంటికే వస్తున్నారు..



మా ఇంటికే ప్రతీ వారం వైద్యులు, వైద్య సిబ్బంది వస్తున్నారు. గతంలో సంతకవిటి ఆస్పత్రికి మా కుటుంబీకులు తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఆ సమస్య లేదు. డాక్టర్లు గ్రామంలోకి వచ్చిన వెంటనే మా ఇంటికి వచ్చి నాకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు మందులు ఇస్తున్నారు. వైద్యసేవలు ఇంటికి వచ్చి అందించడం చాలా ఆనందంగా ఉంది.

– వావిలపల్లి అప్పన్న, శ్రీహరినాయుడుపేట, రాజాం

మెరుగైన వైద్య సేవలు



గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అన్ని రకాల సేవలు రోగులకు అందుతున్నాయి.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

మరణంలోనూ వీడని పేగు బంధం

- గుండె పోటుతో తల్లి మృతి
- తట్టుకోలేక ఆగిన కుమారుడి ఊపిరి
- రాజాంలో విషాదం



మృతి చెందిన తల్లీ కుమారుడు కురమమ్మ, అమర్ (ఫైల్)

రాజాం సిటీ: తల్లీ కొడుకుల పేగు బంధం విడిపోనిది. తల్లిపై ఆ కుమారుడి మమకారం చెప్పలేనిది. అందుకే తల్లి మరణవార్త తెలుసుకున్న కుమారుడి గుండె కూడా ఆగిపోయింది. ఆదివారం వేర్వేరు చోట్ల జరిగిన ఈ విషాద ఘటనల వివరాల్లోకి వెళ్తే...రాజాం పట్టణానికి చెందిన యందవ కురమమ్మ(50) శ్రీకాకుళం జిల్లా పలాస ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే ఆదివారం కూడా విధులకు హాజరైన ఆమెకు ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో బీపీ, షుగర్ లెవల్స్ ఒక్కసారిగా పడిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు తొలుత పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో టెక్కలి ఏరియా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. అక్కడకు తరలించేందుకు సిద్ధపడుతున్న సమయంలో తీవ్రమైన గుండె పోటుకు గురై మృతి చెందినట్టు ఆర్టీసీ డిపో మేనేజరు ఆర్.సీతారామనాయుడు తెలిపారని స్థానికులు పేర్కొన్నారు. ఆమె మృతి చెందిన విషయం రాజాంలోని మెంటిపేట ఎస్సీ కాలనీలో ఉన్న బంధువులకు తెలియడంతో విషాదంలో మునిగిపోయారు.

తల్లి వెంటే తనయుడు

యందవ కురమమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు యందవ అమర్ (24) ఏలూరులో ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ శిక్షణ పొందుతున్నాడు. తల్లి మరణవార్త తెలియగానే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అప్రమత్తమైన స్థానికులు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ వార్త రాజాంలోని బంధువులకు తెలియడంతో ఆయన మృతదేహం తీసుకువచ్చేందుకు అక్కడకు పయనమయ్యారని స్థానికులు తెలిపారు. తల్లి మరణవార్త తెలియగానే కుమారుడు కుప్పకూలిపోయి మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకొంది. వీరిద్దరి విడదీయరాని పేగు బంధం పలువురిని కంటతడి పెట్టించింది.

మడ్డువలస నీటి విడుదల రేపు



మడ్డువలస ప్రాజెక్టు

- సాగునీటి రైతులకు తీపి కబురు
- హాజరు కానున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వంగర: మండలంలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు ఇరిగేషన్ అధికారులు తీపికబురు అందించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు సాగునీటి విడుదలకు రంగం సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 25న ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేసినట్లు డీఈ పి.అర్జున్ ఆదివారం వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని తొమ్మిది మండలాల పరిధిలో 110 గ్రామాల్లో అధికారికంగా 30,077 ఎకరాల ఆయకట్టు భూములకు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీటిని సరఫరా చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ప్రాజెక్టు వద్ద గేట్లు, రోప్‌లు మరమ్మతులతో పాటు పలు రకాల పనులు చేపట్టడంతో ప్రాజెక్టులో నీటిని తొలగించడంతో నీటి విడుదలలో కొంత జాప్యం జరిగిందన్నారు.

రెండో ఫేజ్‌లో ఇలా..

శ్రీకాకుళం జిల్లాలో రెండో ఫేజ్‌లో 12,667 ఎకరాలకు సాగునీందించాల్సి ఉంది. అయితే రెండో ఫేజ్‌లో లావేరు మండలంలో 5200 ఎకరాలకు మాత్రమే సాగునీరందించనున్నారు. జి.సిగడాంలో 1773 ఎకరాలు, పొందూరులో 4618 ఎకరాలు, ఎచ్చెర్లలో 1076 ఎకరాలు మొత్తం కలిపి 7467 ఎకరాలకు కాలువ తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నందున ఈ విస్తీర్ణానికి సాగునీటి సరఫరా జరగదని తెలిపారు.

రూ.1.80కోట్లతో మరమ్మతులు

ఈ ఏడాది ప్రాజెక్టు వద్ద గేట్లు, రోప్‌లు మరమ్మతులు పేరిట రూ.1.80 కోట్లతో మరమ్మతులు చేపట్టడంతో అధికారులు ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని కిందకు విడిచిపెట్టారు. దీంతో ప్రాజెక్టు వద్ద 0.55 టీఎంసీ నీరు మాత్రమే ప్రాజెక్టులో ఉంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 65 మీటర్లు లెవెల్ కాగా 3.3 టీఎంసీల కెపాసిటీ నీరు నిలువ ఉంటుంది. ప్రస్తుతం 60.22 మీటర్లు లెవెల్ నీటిమట్టం నమోదు కావడంతో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో 0.55 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రతీ రోజు ఆయకట్టుకు 100 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తామని, వర్షాలు పుష్కలంగా పడుతున్నాయని, నదుల్లో ఇన్‌ఫ్లో పెరిగితే ప్రాజెక్టులో నీటి నిల్వ పెరుగుతోందని వెల్లడించారు.

హాజరు కానున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మడ్డువలస కుడి ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు హాజరవుతారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు తెలిపారు.

మండలాల వారీగా సాగు భూముల వివరాలు..

మండలం	ఫస్ట్ ఫేజ్ ఆయకట్టు
వంగర	996.40 ఎకరాలు
సంతకవిటి	10,976 ఎకరాలు
రేగిడి ఆమదాలవలస	6776.95 ఎకరాలు
జి.సిగడాం	6029.03 ఎకరాలు
పొందూరు	99.20 ఎకరాలు
మొత్తం	24,877 ఎకరాలు

ఇకపై టేక్ హోం రేషన్



గంట్యాడ అంగన్‌వాడీ కేంద్రం - 2లో గర్భిణులు, బాలింతలకు సరుకులు అందజేస్తున్న కార్యకర్త

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోంది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇక ఇంటికే అందించనుంది. తద్వారా వారి ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించనుంది.

- అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారుల ఇంటికే సరుకులు
- గర్భిణులు, బాలింతలకు మరిన్ని సేవలు
- జిల్లాలో 9930 మంది గర్భిణులు
- బాలింతలు 9668 మంది
- రాగి పిండి, అటుకులు, చెక్కీలు, బెల్లం, కర్జూరం అందజేత

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవమయ్యే వరకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. గర్భం దాల్చిన వెంటనే రిజిస్టర్ చేయడంతో వైద్య తనిఖీలు క్రమం తప్పకుండా చేయించడం ప్రసవమయ్యే వరకు పర్యవేక్షణ చేయడం ప్రభుత్వం చేయిస్తోంది. గర్భిణులు రక్తహీనత, పౌష్టికాహారం బారిన పడకుండా ఉండేందుకు వారికి బలవర్ధకమైన పోషకాహారం అందిస్తోంది. ఇంతవరకు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద సరుకులు కూడా ఇస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు గర్భిణులు పూర్తి స్థాయిలో భోజనానికి రావడం లేదు. గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణాల్లోను ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో వారి ఇంటికే అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తోంది.

జిల్లాలో 9930 మంది గర్భిణులు

జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నుంచి మూడేళ్లలోపు పిల్లలు 44,745 మంది ఉన్నారు. అదే విధంగా 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు 23,255 మంది ఉన్నారు. గర్భిణులు 9930 మంది ఉన్నారు. బాలింతలు 9,668 మంది ఉన్నారు.

అందనున్న సరుకులు

టేక్ హోం రేషన్ (ఇంటి వద్దకే సరుకులు) కింద రాగి పిండి (2 కేజీలు), అటుకలు (కేజీ), చెక్కీలు (పావు కేజీ), బెల్లం (పావు కేజీ), కర్జూరం (పావు కేజీ), 25 గుడ్లు, 5 లీటర్ల పాలు గర్భిణులు, బాలింతలకు ఇవ్వనున్నారు. ఇవన్ని అధిక పోషక విలువలతో కూడుకున్నవి. తద్వారా వారి సంపూర్ణ ఆరోగ్యానికి భరోసా కల్పించనుంది.



జగ్గాపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు చేస్తున్న గర్భిణులు

ఇంటికే సరుకులు

గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్ కింద ప్రభుత్వం సరుకులు అందించనుంది. ఇందు కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది.

– బి.శాంతకుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి

క్లుప్తంగా

పక్కాగా ఎస్‌బీఐ సేవలు

● జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్



ఆరికతోట వినియోగదారుల సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌బీఐ జోనల్ చీఫ్ మేనేజర్

రామభద్రపురం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖాతాదారుల సేవా కేంద్రాల్లో సేవలు పక్కాగా నిర్వహించి వినియోగదారులకు పక్కాగా సేవలు అందించాలని విశాఖ జోనల్ చీఫ్ మేనేజర్ వేణుగోపాల్ సూచించారు. బొబ్బిలి ఆర్బీ వో పరిధిలోని పలు ఖాతాదారుల సేవా కేంద్రాల్లో ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించా రు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం, గొల్లపేటలో గల సేవా కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సత్వర వినియోగానికి ఈ కేంద్రాలను బ్యాంక్ కల్పించిందన్నారు. ఈ కేంద్రాలను ఖాతాదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. అందరి ఖాతాదారులకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాలు వర్తించేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ పథకంలో సహజ మర ణం పొందితే రూ.రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మర ణిస్తే రూ.4 లక్షలు వర్తిస్తాయని తెలిపారు. ఈ పథకాలు అన్ని కేంద్రాలలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయన వెంట జెడ్‌ఎంపీ జిల్లా కో ఆర్డినేటర్ మూడడ్ల వెంకటరావు, కేంద్రాల నిర్వాహకులు సీఎస్పీ పీవీ సత్యారావు, అరుణశ్రీ ఉన్నారు.

కుక్కల దాడిలో 11 మూగజీవాల మృతి



కుక్కల దాడిలో మరణించిన మేక, గొర్రె పిల్లలు

పాలకొండ రూరల్: పట్టణంలోని యాలాం కూడలిలో శనగల దుర్గారావుకు చెందిన 11 మేక, గొర్రె పిల్లలు వీధి కుక్కల దాడిలో ఆదివారం మరణించాయి. మేకల దొడ్డిలో కుక్కలు చొరబడి తీవ్రంగా గాయపరచడంతో మృత్యువాత పడ్డాయని బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. మేకల పెంపకంపై ఆధారపడి జీవనం గడుపుతున్నామని, వాటి మరణంతో రూ.50 వేలకు పైబడి నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. అధికారులు తన కష్టం గుర్తించాలని రోదించాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పార్వతీపురం/సీతానగరం: పార్వతీపురం మండలం నడిమిములగ గ్రామానికి చెందిన మడక ఉదయ్ కుమార్ స్నేహితుడు సురాపాటి చంటితో కలిసి మోటార్ సైకిల్‌పై బొబ్బిలి వెళ్తుండగా, ప్రమాదానికి గురి కావడంతో ఇద్దరూ ఆదివారం ఉదయం తీవ్ర గాయాలపాలయ్యారు. మార్గమధ్యంలో తాన్న సీతారాంపురం కూడలి వద్దకు వారి బైక్ వచ్చేసరికి సీతానగరం నుంచి పార్వతీపురం వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో మోటార్‌సైకిల్‌పై నుంచి తుళ్లి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్, చంటి గాయాల పాలవడంతో గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదుచేశామని సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఈ నెల 22 సాయంత్రం ఎవరూలేని సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయిందని తల్లి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వేరే అబ్బాయిని ప్రేమిస్తున్నానని అతనితో వెళ్లిపోతున్నానని, నాకోసం వెతకవద్దని లెటర్‌రాసి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	60,160-00
బంగారం(22కె. 10గ్రా.)	55,150-00
వెండి (కిలో)	80,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

శరవేగంగా..సర్వే

● ఇప్పటివరకూ రెండు దశల్లో పూర్తి
● పెరిగిన ఖాతాలు, సబ్ డివిజన్‌లు
● 2.79 లక్షల కిలోమీటర్ల డ్రోన్ సర్వే
● 11,452 మంది భూ సమస్యల పరిష్కారం
● 50 వేల మంది రైతులకు పట్టాలు



గడిముడిదాంలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న అధికారులు



గుళ్లసీతారాంపురంలో సర్వే చేస్తున్న అధికారులు

రాజాం: గ్రామాల్లో పంటపొలాల కొలతలు నిర్ధారించుకునేందుకు రైతులు చాలా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా ఏరైతు భూమిని ఆ రైతుకు ఆన్‌లైన్ చేసి ఇచ్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకం ద్వారా భూముల రీ సర్వే చేయడంతో పాటు వినతులు స్వీకరించి, నో అబ్జెక్షన్ పత్రాలు జారీ చేసి, రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తోంది. దీంతో భూమి ఉండి పత్రాలు లేని రైతులు చాలా మంది లబ్ధిపొందడమే కాకుండా ప్రస్తుతం వారి పంటపొలాల్లో హద్దులు పక్కా చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వందల ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉండిపోయిన సమస్యలు ఈ పథకం ద్వారా పరిష్కారం కావడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమం ద్వారా భూముల సమగ్ర సర్వే శరవేగంగా జరుగుతోంది. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ సర్వే, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో విజయనగరం జిల్లాలో దశలవారీగా సమగ్రంగా భూముల సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకూ జిల్లాలోని 807 గ్రామాల్లో 2,79,679 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో డ్రోన్ సర్వే పూర్తయింది. మొదటి దశ కింద 179 గ్రామాల్లో 84,327 ఎకరాల భూమిని సర్వే చేయగా, ఆ గ్రామాల్లో మొదట్లో 50,299 గ్రామ ఖాతాలు ఉండగా, రీ సర్వే తరువాత ఖాతాల సంఖ్య 61,751కి పెరిగింది. ఆయా గ్రామాల్లో 11,452 భూ సమస్యలు పరిష్కరించి, పట్టాలను మంజూరు చేశారు. పాత సర్వే డివిజన్‌లు 92,541 ఉండగా, రీ సర్వే అనంతరం వాటి సంఖ్య 1,94,606కు పెరిగింది. ఇప్పటివరకూ 27,945 ఖాతాలకు సంబంధించి భూ హక్కు పత్రాలు పట్టాదారులకు అందజేయగా, రెండో దశ కింద 27 మండలాల్లోని 306 గ్రామాల్లో సుమారు 28,644ఎకరాల భూమి సర్వేకు సిద్ధం చేశారు. మొదటి, రెండు దశలు కలిపి 27 మండలాల్లో 485 గ్రామాలకు చెందిన 1,89,511 ఎకరాల భూమిని సర్వే చేసి, 50 వేల మంది రైతులకు పట్టాలు అందించారు.



రైతులకు అందిస్తున్న జగనన్న భూ హక్కు పత్రాలు

సమగ్ర వివరాలతో పత్రాలు

జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలు ఈ పాస్ పుస్తకాలను పోలిన విధంగా ఉన్నాయి. ఇందులో రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు, పంటపొలాల వివరాలతో పాటు పొలం హద్దులు, మ్యాప్ కూడా జోడించి ఇస్తున్నారు. ఈ పత్రం ఒక బుక్‌లెట్‌గా ఉండడంతో పాటు లోపల ఈ స్కానింగ్ కూడా ఉంది. పంట రుణాలతో పాటు క్రయ విక్రయాలకు కూడా ఈ పత్రాలే ప్రామాణికమని ఆర్‌డీఓ అప్పారావు వెల్లడించారు.

చాలా మంచి కార్యక్రమం



జగనన్న శాశ్వత భూ హక్కు పథకం చాలా మంచి కార్యక్రమం. మా గ్రామంలో చాలా పంటపొలాల హద్దులు ఇబ్బందుల్లో ఉండేవి. ఈపథకం ద్వారా ఆ సమస్య పరిష్కారమైంది. వందేళ్ల నుంచి ఈ సర్వేలేక ఇబ్బందులు అధికమయ్యాయి. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ సమస్యకు పరిష్కారం దొరకడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, ఉణుకూరు, రేగిడి మండలం.

పట్టాలు రావడంతో రుణాలు వస్తున్నాయి



మాకు గ్రామంలో 80 సెంట్ల సాగుభూమి ఉంది. కానీ ఎటువంటి కాగితాలు లేవు. జగనన్న శాశ్వత భూ హక్కు సర్వే ద్వారా మా పొలానికి సంబంధించి పాస్‌పుస్తకాలు అందాయి. మాకు ఇప్పుడు బ్యాంకు రుణాలు కూడా అందుతున్నాయి.

తమ్మినేని లావణ్య, వాల్తేరు, సంతకవిటి మండలం

త్వరితగతిన సర్వే



జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం చాలా మంచి కార్యక్రమం. త్వరితగతిన ఈ సర్వే చేస్తున్నాం. రెండు దశల్లో చీపురుపల్లి డివిజన్ పరిధిలో 40 శాతం మేర డ్రోన్ సర్వే పూర్తయింది. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో రైతులకు వెంటనే పాస్ పుస్తకాలు అందిస్తున్నాం. ఎంతో మేలు చేకూర్చే ఈ పథకాన్ని రైతులు వినియోగించుకుంటున్నారు.

ఎం.అప్పారావు, ఆర్‌డీఓ, చీపురుపల్లి

కేవీ విద్యార్థినికి డిప్యూటీ స్పీకర్ అభినందన

విజయనగరం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఏపీ, తెలంగాణ కేంద్రియ విద్యాలయ సంఘటన్ రీజినల్ క్రీడా పోటీల్లో విజయనగరానికి చెందిన కేంద్రియ విద్యాలయం విద్యార్థిని సత్తా చాటింది. అండర్-17 విభాగంలో 9వ తరగతి చదువుతున్న పి.విశ్వకృప డిస్క్ త్రో లో బంగారం, రిలేలో కాంస్య పతకాలు సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఆయన నివాసం వద్ద ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ నేపథ్యంలో ఆమె సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్న కోలగట్ల..ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, మరిన్ని పతకాలు సాధించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



విశ్వకృపను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

భగవద్గీత పఠనం.. మోక్ష ప్రదాయం..



భగవద్గీత ముఖ్యాంశాలను వివరిస్తున్న ఆధ్యాత్మిక వక్త రమణ

రేగిడి: భగవద్గీత పఠనం మోక్ష ప్రదాయమని పాలకొండకు చెందిన సత్యసాయి భక్తుడు, ఆధ్యాత్మిక వక్త ఎన్వీ రమణ తెలిపారు. ఆదివారం మండలంలోని దేవుదల గీతా మందిరంలో గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో జరిగిన దివ్య జీవన సత్సంగ సమావేశంలో పాల్గొన్న ఆయన భగవద్గీతను పఠిస్తే చెడు గీతలు చెరిగిపోతాయన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ తమ తమ పనుల్లో బిజీగా ఉండడం వల్ల మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మాత్రమే మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మోహన్‌దాస్, అప్పలరాం, నిత్య స్మరణానందస్వామి, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-17 బాల, బాలికల బాడ్మింటన్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి నెల్లూరు జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో జిల్లా నుంచి 6 గురు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనుండగా..బాలుర విభాగంలో ఎం.రోహిత్, ఏవీ.భరద్వాజ్, కె. రేవంత్, బాలికల విభాగంలో వై.జాహ్నవి, వై.రేణుశ్రీ, కె.ప్రజ్ఞానాయుడులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు అంతర్ జిల్లాల బాల, బాలికల పోటీల్లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీ పడనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరైన జట్టుకు పర్యవేక్షకులుగా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ వీఎస్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.కుసుం బచ్చన్ వ్యవహరించనున్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

డ్రైవర్‌ను హత్య చేసి లారీ చోరీ

● అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు
● రిమాండ్‌కు ఐదుగురు నిందితుల తరలింపు



సమావేశంలో మట్లాడుతున్న చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి, చిత్రంలో నిందితులు

బొండపల్లి: ఈనెల 13 వతేదీన గొట్లాం గ్రామం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి, అనుమానాస్పద స్థితిలో రైల్వే పట్టాలపై మృతి చెంది పడి ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి బొండపల్లి పోలీసులకు కేసును బదిలీ చేశారు.

అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో దర్యాప్తు

రైల్వే పోలీసులు బదలాయించిన అనుమానాస్పద మృతి కేసుకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి అది హత్యగా నిర్ధారించారు. ఈ కేసుకు సంబంధించి చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి ఆదివారం బొండపల్లి పోలీస్ స్టేషన్‌లో వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు జగదీష్ యాదవ్ (50) ఈ నెల 13న ఒడిశాలోని రాయగడ నుంచి విశాఖపట్నానికి ఐరన్‌లోడుతో లారీ తీసుకువస్తుండగా ఒడిశాలోని రాయగడ పరిసర ప్రాంతాలకు చెందిన కేసులో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావుతో పాటు కొంతమంది ప్రయాణికుల ముసుగులో లారీ ఎక్కారు. లారీ మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు వద్దకు చేరుకునే సరికి డ్రైవర్‌ను హత్య చేసి మృతదేహాన్ని రైలు పట్టాల మధ్యలోకి విసిరివేశారు. అక్కడి నుంచి లారీతో గొట్లాం బైపాస్ మార్గంలో తగరపువలస మీదుగా భోగాపురం చేరుకుని స్క్రాప్ వ్యాపారి బెవర సాయిబాబాకు లారీతో పాటు ఇనుము విక్రయించారు. జీపీఎస్ ద్వారా లారీ జాడ కనుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా లారీని, ఇనుము కొనుగోలు చేసిన బెవర సాయిబాబును అదుపులోకి తీసుకుని విచారణ చేయగా కేసు ముడి వీడింది. దీంతో కేసులో ప్రధాన నిందితుడు హరి ఈశ్వర్రావుతో పాటు సహకరించిన మీసాల జయరాం, మీసాల చంద్రశేఖర్, ఎ.ధనుంజరావులతో పాటు వ్యాపారి సాయిబాబును అదుపులోకి తీసుకున్నారు. చోరీకి గురైన లారీతో పాటు, నిందితులు వినియోగించిన ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులకు సంబంధం ఉండగా మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గజపతినగరం సర్కిల్ పోలీసులు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. సమావేశంలో గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, బొండపల్లి ఎస్సై ఎస్.రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

జెడ్పీ చైర్మన్‌కు పరామర్శల వెల్లువ

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు పరామర్శల వెల్లువ కొనసాగింది. జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నరసింగరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు ఆదివారం విజయనగరంలోని ప్రదీప్‌నగర్‌లో గల ఆయన నివాసం సమీపంలో గల మెట్రో కన్వెన్షన్ హాల్‌లో పెద్దకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మజ్జి శ్రీనివాసరావు అభిమానులు వేలాదిగా తరలివచ్చి మజ్జి నర్సింగరావు చిత్రంపటం వద్ద నివాళులర్పించడంతో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మజ్జి శ్రీనివాసరావును పరామర్శించిన వారిలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి కురసాల కన్నబాబు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, కంబాల జోగులు, విశ్వసరాయ కళావతి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, పాకలపాటి రఘువర్మ, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ అవనాపు భావన, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



జెడ్పీ చైర్మన్ తండ్రి మజ్జి నరసింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయ నగరంలోని ఫైర్ చెస్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 54 మంది క్రీడాకారులు హాజరు కాగా..ఓపెన్ కేటగిరీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో గల టీటీడీ కల్యాణ మంటపం ప్రాంగణంలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో చరణ్, జి.పర్వేష్, ప్రసాద్, శ్రీనివాసరావులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియను అసోసియేషన్ కోశాధికారి అశ్విన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి ఎం.గణేష్‌నాయుడులు పర్యవేక్షించగా..ఆర్బిట్రేటర్‌లుగా వి.వెంకటేష్, కె.ధనలక్ష్మి వ్యవహరించారు.



ఎంపిక పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

3తులాల బంగారం చోరీ

బలిజిపేట: మండలంలోని మురగడాంలో రెండు నివాసగృహాలలో మూడు తులాల బంగారం చోరీకి గురైంది. దీనిపై బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బలిజిపేట ఎస్సై ప్రశాంత్‌కుమార్ దర్యాప్తు నిర్వహించారు. కాగాన లక్ష్మమ్మకు చెందిన 2తులాల బంగారం, బాత సింహాచలానికి చెందిన ఒక తులం బంగారం పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పొలంపని నిమిత్తం ఇంటికి తాళాలు వేసి ప్రతిరోజూ పనికి వెళ్లిపోతూ ఇంట్లో ఉన్న బంగారం వస్తువులను వారు పట్టించుకోలేదు. ఆదివారం ఇళ్లలో చూసుకోగా బంగారం పోయినట్లు గుర్తించి లబోదిబోమన్నారు.



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

విద్యుత్ వైర్ల చోరీపై ఫిర్యాదు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల జగనన్న లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలకు వేసిన సిల్వర్ వైర్లు చోరీకి గురైనట్లు బొండపల్లి ఏఈఈ ఆర్.శంకర్రావు స్థానిక ఎస్సై ఎస్.రవికి ఆదివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో గల లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలకు వేసిన రూ.లక్షాయాభైవేల విలువ చేసే విద్యుత్ వైర్లు కట్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గ్రామ సర్పంచ్ మండా ఆదిలక్ష్మి గుర్తించి తమ దృష్టికి తీసుకువచ్చారని ఏఈఈ తెలిపారు. ఈ మేరకు లేఅవుట్‌ను పరిశీలించి వైర్లు అపహరణకు గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

25న నియోజకవర్గ స్థాయి సమావేశం

పార్వతీపురం: పార్వతీపురం, సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశాలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఉదయం 10 గంటలకు పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో సాలూరు నియోజకవర్గ స్థాయి సమావేశం, మధ్యాహ్నం 2 గంటలకు పార్వతీపురం నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమలశాఖామంత్రి గుడివాడ అమర్నాథ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే ఆగస్టు 1న కురుపాం నియోజకవర్గ స్థాయి సమావేశం, ఆగస్టు 8న పాలకొండ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు.

అప్పుల బాధతో ఆత్మహత్య



బాడంగి సీహెచ్‌సీలో చికిత్సపొందుతున్న బాధితుడు గంగరాజు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని శేరీపేట గ్రామానికి చెందిన అంబళ్ల శ్రీను(25) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీను సుమారు రూ.20లక్షల వరకు అప్పుల బారిన పడి మద్యం వ్యసనానికి బానిసయ్యాడని, ఈ క్రమంలో కుటుంబ కలహాలు కూడా ఏర్పడ్డాయని తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు చెప్పారు. శ్రీనుకు మూడేళ్ల క్రితం వివాహం కాగా భార్య లక్ష్మి, రెండేళ్ల బాలుడు ఉన్నారు.

పురుగు మందు తాగి..

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం గ్రామానికి చెందిన గొర్లె సన్యాసి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్.కోట ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు. గ్రామానికి చెందిన సన్యాసి(48) మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 3గంటల సమయంలో మద్యం తాగేందుకు వెళ్లే ప్రయత్నం చేయగా, భార్య గౌరి మందు వారించడంతో, మనస్తాపం చెంది గడ్డిమందు తాగాడు. దీంతో ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గడ్డిమందు తాగి తీవ్రఅస్వస్థత

బాడంగి: మండలంలోని ముగడగ్రామానికి చెందిన గిరిడిబిల్లి గంగరాజు(35) గడ్డిమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. భార్య, బంధువులు స్థానిక ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తీసుకురాగా డాక్టర్ నాగేశ్వరరావు ప్రథమ చికిత్స చేసి మందుకక్కించే చర్యలు తీసుకున్నప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్‌చేశారు. బాధితుడిది ముగడ గ్రామంకాగా మండలంలోని గొల్లాది గ్రామంలో గల అత్తవారింటికి వారాలపండుగకు వెళ్లి మద్యం తాగిన మీదట గడ్డిమందు తాగడంతో పరిస్థితి విషమంగా మారిందని డాక్టర్ చెప్పారు.